
భృతి లేదు.. జాబు రాదు!

- సూపర్ సిక్స్‌లో మొట్టమొదటి హామీపై నోరు మెదపని సర్కారు
- నిరుద్యోగుల ఆశలపై నీళ్లుచల్లిన కూటమి ప్రభుత్వం
- అటకెక్కిన రూ.3వేలు నిరుద్యోగ భృతి
- జాడే లేని జాబ్ క్యాలెండర్
- కూటమి ప్రభుత్వంపై భగ్గుమంటున్న నిరుద్యోగ యువత
- బాబు చేతిలో మళ్లీ మోసపోయామంటున్న యువత



దాచేపల్లి: కూటమి ప్రభుత్వం తీరుపై నిరుద్యోగ యువత భగ్గుమంటోంది. ఎన్నికల హామీల అమలును పూర్తిగా విస్మరించటంపై కూటమి ప్రభుత్వం పనితీరుపై మండిపడుతున్నారు. అధికారంలోకి రాక మునుపు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక ఒక మాట మాట్లాడుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3వేలు నిరుద్యోగ భృతి అమలు చేస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్న భృతి గురించిన తాజా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరగకపోవటంపై మండిపడుతున్నారు. నిరుద్యోగ భృతి అమలు చేసే ఆలోచన లేనట్లుగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ సాక్షిగా తన అభిప్రాయం కుండబద్దలు కొట్టింది.

భృతి.. అంతా భ్రాంతి

గురజాల నియోజకవర్గవ్యాప్తంగా సుమారుగా 23వేలకు పైగా నిరుద్యోగ యువతీ, యువకులు ఉన్నారు. 2014లో చంద్రబాబుని నమ్మి మోసపోయినట్లే ఇప్పుడు కూడా పూర్తిగా మోసపోయినట్లుగా నిరుద్యోగ యువత భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించటంతో పాటుగా ఇంటికో ఉద్యోగం, ఏడాదికి రెండు లక్షలు ఉద్యోగాలు, ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. ఒక వేళ చదువుకున్న వారికి ఉద్యోగాలు రాకపోతే ఉద్యోగం వచ్చేంతవరకు నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగభృతి అందిస్తామని ఊరూరా ప్రచారంతో హోరెత్తించారు. తీరా గెలిచిన హామీల గురించిన ప్రస్తావనే తేవడం మరిచిపోయారు. 2014లో మోసపోయినట్లే.. ఇప్పుడు కూడా తాము మోసపోయామని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జాబ్ క్యాలెండర్‌పై కూడా నీలినీడలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తుందనే ఆశతో గ్రామీణ ప్రాంతాల్లోని యువత కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకుంటున్నారు. కోచింగ్ కోసం ఖర్చు చేయటం నిరుపేద యువతకు భారంగా ఉన్నప్పటికీ నోటిఫికేషన్లు వస్తాయనే ఆశతో అప్పులు చేసి కోచింగ్‌లు తీసుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలల గడుస్తున్నా ఇప్పటివరకు జాబ్‌క్యాలెండర్‌ని ప్రకటించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తారో లేదో అనే అనుమానం నిరుద్యోగుల్లో ఉంది. డీఎస్సీపై సంతకం చేసిన చంద్రబాబు ఇప్పటివరకు నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. సీఎం చేసిన సంతకాల అమలుకే ఇంత కాలం పడితే జాబ్ క్యాలెండర్‌కి ఇంకెంతకాలం పడుతుందో అనే అనుమానం నిరుద్యోగులను వెంటాడుతోంది.

బాబూ.. జాబేది..?



నిరుద్యోగ భృతి ఇచ్చి తీరాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చినవిధంగా నిరుద్యోగభృతి ఇచ్చి తీరాల్సిందే. ఉద్యోగం వచ్చేంతవరకు నిరుద్యోగభృతి ఇస్తామని ప్రకటించటం వల్లే యువత కూటమి వైపు మొగ్గు చూపారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు భృతి అమలుపై మార్గదర్శకాలు విడుదల చేయలేదు. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా కేటాయింపులు జరగలేదు. నిరుద్యోగభృతి ఇచ్చి యువతకు అండగా ఉండి హామీని నిలబెట్టుకోవాలి. జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రకటించాలి.

– జంగాల సింగరయ్య యాదవ్, బీసీ నాయకుడు, దాచేపల్లి

మోసం చేయడం బాబు నైజం



ఎన్నికల్లో విచ్చలవిడిగా హామిలు ఇచ్చి అధికారంలోకి రావటం.. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. రాష్ట్ర బడ్జెట్‌లో నిరుద్యోగభృతికి కేటాయింపులు జరపలేదు. కూటమి ప్రభుత్వంపై నిరుద్యోగ యువత ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ చంద్రబాబు వాటిని నీరుకార్చారు. కూటమి ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించి నిరుద్యోగభృతి అమలుకి చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం పనితీరుపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

– ఇ.అంజనేయరాజు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, దాచేపల్లి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు నరసింహ నాయక్ ఎంపిక



దాచేపల్లి: మండలంలోని భట్రుపాలెంకి చెందిన బాణావత్ నరసింహ నాయక్ రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 6,7 తేదీల్లో గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చూపిన తనను రాష్ట్రస్థాయి జట్టులోకి తీసుకున్నారని నరసింహ నాయక్ బుధవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి జట్టుకు నరసింహనాయక్ ఎంపికవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నరసింహ నాయక్ కేఎల్ యూనివర్సిటీలో పీఈటీగా పనిచేస్తున్నాడు.

మధ్యాహ్న భోజనానికి నిధులు కేటాయించాలి

పిడుగురాళ్ల: రాష్ట్ర బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకానికి నిధులు కేటాయించాలని కోరుతూ ఈనెల 18వ తేదీన నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొనాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు డి.శివకుమారి పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలోని కన్నెగంటి హనుమంత్ భవనంలో బుధవారం మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం చీమకూర్తి సుజాత అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమంలో డి.శివకుమారి మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన కార్మికులు షేక్ సైదా, డి.నాగేంద్రం, వెంకటేష్, జాన్‌బీ, వర్లా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..

రెంటచింతల: క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అన్నారు. బుధవారం స్థానిక లూథరన్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు హెల్ప్ ఫౌండేషన్ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో మరనాత వెల్లటూరు యేసయ్య సహకారంతో హెచ్‌ఎం జి.సుజ్ఞానమ్మతో కలిసి పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినులకు హెల్ప్ ఫౌండేషన్ ద్వారా నగదు బహుమతులను అందచేస్తామని హామీనిచ్చారు. అనంతరం మరనాత యేసయ్యను ఘనంగా సన్మానించారు.

కబడ్డీలో న్యూటన్స్ విద్యార్థుల ప్రతిభ



మాచర్ల రూరల్: జేఎన్‌టీయూ పరిధిలో జరిగిన అంతర కళాశాలలో జరిగిన టోర్నమెంట్ కబడ్డీ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కళాశాలలో కబడ్డీ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ జి.జగదీష్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

వేయింగ్ మిషన్ పంపిణీ

గురజాల రూరల్: మండల పరిధిలోని మాడుగుల గ్రామంలోని పంచాయతీ కార్యాలయానికి ఐటీసీ, సెర్ఫ్ ఆధ్వర్యంలో బుధవారం వేయింగ్ మిషన్‌ను అందించారు. ఐటీసీ సెర్ఫ్ సీఓ ఎం.గురుప్రసాద్ చేతుల మీదుగా అందించారు. సర్పంచ్ మోషే, కార్యదర్శి విజయ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి ఇంటిముందు మహిళ ఆత్మహత్యాయత్నం

పిడుగురాళ్ల: వడ్డీ వ్యాపారి ఇంటి ముందు ఓ మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని షాదిఖానీ ఎదురు బజారులో బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జానపాడు గ్రామానికి చెందిన మంగమ్మ తన కుమారుడు ఆస్ట్రేలియా వెళ్లాలని అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని సంప్రదించగా అతను పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారి అల్లూరి పరమేశ్వరరావును పరిచయం చేశాడు. మంగమ్మ తనకు రూ.7 లక్షల నగదు కావాలని పరమేశ్వరరావుకు చెప్పగా పరమేశ్వరరావు ఇంటిని తనఖా రిజిస్ట్రేషన్ చెయ్యాలని చెప్పాడని బాధితురాలు మంగమ్మ తెలిపింది. వెంటనే రూ. 7 లక్షలు తీసుకొని తనఖా రిజిస్ట్రేషన్ చేశానని, కొంతకాలానికి రూ.3 లక్షలు వడ్డీ అయిందని పరమేశ్వరరావు తెలపగా.. మంగమ్మ వడ్డీ రూ. 3 లక్షలు పరమేశ్వరరావుకు చెల్లించింది. మిగిలిన రూ.7 లక్షలు కూడా వెంటనే ఇస్తాను, ఇంటి కాగితాలు ఇవ్వమని చెప్పగా పరమేశ్వరరావు రూ. 30 లక్షలు ఇస్తేనే కాగితాలు ఇస్తానని తేల్చిచెప్పాడు. దీంతోపాటు మంగళవారం రాత్రి ఇంటి వద్దకు వచ్చిన తనను అసభ్య పదజాలతో దూషించాడని మంగమ్మ తెలిపింది. తనకున్న ఒక్క ఇల్లు పోతుందనే భయంతో పరమేశ్వరరావు ఇంటి ముందు కూర్చొని నిరాహార దీక్ష చేసి, ఇంటి ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేసింది. సమాచారం అందుకున్న ఎస్ఐ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని పరమేశ్వరరావును, బాధితురాలు మంగమ్మను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇది ఇలా ఉండగా తనఖా రిజిస్ట్రేషన్ అని చెప్పి తన ఇంటిని నేరుగా సేల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, నేనే ఇంటి పన్ను తానే కడుతున్నానని, ఇల్లు తనదేనని, ఇల్లు కావాలంటే మరో రూ. 30 లక్షలు ఇవ్వాలని పరమేశ్వరరావు బెదిరిస్తున్నాడని బాధితురాలు మంగమ్మ తెలిపింది.

ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్ సత్తిబాబు

కారెంపూడి: ట్రాక్టర్ నడుపుతూ వ్యక్తి అదే ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల శివారు రామాపురం మేజర్ కాల్వ సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కాకినాడు జిల్లా నుంచి సుబాబుల్ చెట్లు నరకడానికి కూలీలు వినుకొండకు వలస వచ్చారు. అక్కడ పనులు అయిపోవడంతో నల్గొండ జిల్లా సూర్యాపేటలో పనులు చేసేందుకు రెండు ట్రాక్టర్లలో వీరు బయలు దేరారు. ఒక ట్రాక్టర్ ముందు వెళ్లిపోగా రెండవ ట్రాక్టర్ అదుపు తప్పి పొలాలలోకి దూసుకెళ్లింది. అదే టాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. ట్రాలీ బోల్తా కొట్టకపోవడంతో ట్రాలీలలో ఉన్న కూలీలు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదానికి కారణం తెలియడం లేదు.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పిందా లేక మరేదైనా కారణం ఉందో తెలియడం లేదు. మృతుడు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చింతలూరుకు చెందిన తాడి సత్తిబాబు (40)గా పోలీసులు గుర్తించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఎస్ఐ వాసు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార ఎమ్మార్పీఎస్ కమిటీ రద్దు

ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డిపర్తి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న గడ్డిపర్తి శ్రీనివాసరావు

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురి సౌత్‌లో ఈ నెల 3వ తేదీన కొంతమంది మాచర్ల నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని నియమించినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆ అనధికార ఎమ్మార్పీఎస్ కమిటీని రద్దు చేస్తున్నట్లు ఎంఎస్‌పీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు, మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గడ్డిపర్తి శ్రీనివాసరావు ప్రకటించారు. బుధవారం మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వార్థపరులకు, అసాంఘిక శక్తులకు ఎమ్మార్పీఎస్‌లో చోటులేదన్నారు. విజయపురిసౌత్ ఎంఎస్పీ అధ్యక్షుడుగా, ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా ఊరే మార్క్ కొనసాగుతారన్నారు. త్వరలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఎన్నుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరు రమేష్ మాదిగ, దానియేలు, ఏపూరి ఏలియ, బిర్నిడి నాగేశ్వరావు, బొంత అరుణ్ కిరణ్ కుమార్, గంగవరపు వెంకయ్య, గంగవరపు రామయ్య, కుక్కముడి జగజీవన్, ఊరే మధు తదితరులు పాల్గొన్నారు.

9న 'రాంసా ఫౌండేషన్' ప్రతిభా పరీక్ష



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం ఎస్.హనుమంత్ శాస్త్రి, ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లాస్థాయిలో 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాంసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన స్కాలర్‌షిప్ ప్రతిభా పరీక్షలు పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తామని రాంసా ఫౌండేషన్ ఫౌండర్ బీవీ రమణ తెలిపారు. బుధవారం బ్రాహ్మణపల్లి జడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 11 గంటలకు స్కాలర్ షిప్ టెస్ట్ జరుగుతుందని, మొదటి బహుమతి రూ. 10 వేలు, రెండవ బహుమతి రూ.6 వేలు, మూడవ బహుమతి రూ. 3 వేలు, ఆదేవిధంగా ప్రోత్సాహక బహుమతులు కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 7,8,9 తరగతి విద్యార్థులను కలిపి ఒక జట్టుగా క్విజ్ పోటీలు నిర్వహించనున్నామని, ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. వీరికి కూడా మొదటి బహుమతి రూ.6 వేలు, రెండవ బహుమతి రూ.4,500లు, మూడవ బహుమతి రూ.3 వేలు ఉంటుందన్నారు. స్కాలర్ షిప్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విద్యార్థులకు సంస్థ తరపున రెండు సంవత్సరాల ఇంటర్ విద్య పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు బీవీ రమణ 9963223714, బాజీ ఖాన్ 9949614674 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆర్థిక లావాదేవీల వల్లే అంజిబాబు మృతి

పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు

పిడుగురాళ్ల: ఆర్థిక లావాదేవీల కారణంగానే సత్తెనపల్లికి చెందిన మందడపు అంజిబాబును సత్తెనపల్లికి చెందిన కొందరు వ్యక్తులు పురుగుల మందు తాగించి చంపేశారనే ప్రత్యక్ష సాక్షుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు బుధవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి గవస్‌కుమార్‌రెడ్డి, ఫిర్యాది అయిన పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ మాస్టర్ రామారావు తెలిపిన వివరాల మేరకు మృతుడు అంజిబాబు సత్తెనపల్లిలో నివాసం ఉంటున్నాడని, అక్కడ అంజిబాబుకు అప్పులు ఏర్పడినట్లు, వాటిని తీర్చలేని పరిస్థితుల్లో, కొంతకాలం అప్పుల బాధ తప్పించుకోవటం కోసం పిడుగురాళ్లలోని రామారావు వద్దకు చేరాడు. అతనితో పాటు రైల్వే క్వార్టర్స్‌లో తలదాచుకున్నాడు. అంజిబాబు, అతనితోపాటు గవస్‌కుమార్‌రెడ్డి కూడా ఉన్నాడు. అయితే అంజిబాబు సత్తెనపల్లికి చెందిన షేక్ మహబుబ్ సుభాని అలియాస్ సుప్రీం అనే వ్యక్తికి రూ. 2.50 లక్షలు అప్పుడు ఉన్నాడు. దానికి గాను సుప్రీం స్నేహితులతో కలిసి అంజిబాబును వెతుకుతూ ఈ నెల 3వ తేదీన ఉదయం 9.30 గంటల సమయంలో పిడుగురాళ్ల రైల్వే క్వార్టర్స్‌కు వచ్చి అక్కడ అంజిబాబును గుర్తించి మాట్లాడుకుందాం రమ్మని అంజిబాబును తనతోపాటు ఉన్న గవస్ కుమార్‌రెడ్డిని సుప్రీంతోపాటు కారులో తీసుకొని వెళ్లారు. ఖలీల్ దాబా ఎదురుగా ఉన్న ఖాళీ ప్లాట్ల వద్ద సుప్రీం తనకురావాల్సిన అప్పు గురించి గొడవ పడ్డారు. అక్కడ ఇద్దరు చేతులతో కొట్టుకున్నారు. తర్వాత అంజిబాబు సుప్రీంకు ఇవ్వాల్సిన డబ్బుల కోసం అంజిబాబుకు తెలిసిన వాళ్లను ఫోన్‌లో అడిగాడు. ఎవరు ఇవ్వకపోవటంతో అంజిబాబు మన స్థావానికి గుర్రై అందరు కలిసి అక్కడి నుంచి మాచవరం మండలంలోని నాగేశ్వరపురం తండా శివారు పొలాలలోకి వెళ్లారు. అక్కడ రాత్రి ఏడు గంటల వరకు ఉన్నారు. అక్కడ అంజిబాబును సుప్రీంతో పాటు వచ్చిన స్నేహితులందరు అప్పు తీర్చకపోతే చచ్చిపొమ్మని రెచ్చగొట్టారు. గడ్డి మందు తెచ్చి ఇస్తే తాగి చనిపోతానని అంజిబాబు తెలిపినట్లు, అలాగే సుప్రీంతోపాటు వచ్చిన వారు గడ్డిమందు తీసుకొని ఇచ్చారు. అంజిబాబు మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగాడు. అనంతరం అతనితోపాటు అతని స్నేహితులందరు భయపడి పారిపోయారు. అంజిబాబును తొలుత పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్చారని, అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. సాక్షుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు పేర్కొన్నారు.

హత్య కేసు విచారించిన జిల్లా ఎస్పీ

పిడుగురాళ్ల: సత్తెనపల్లి నివాసి అయిన మందడపు అంజిబాబు హత్యకేసు విషయంలో విచారణ నిమిత్తం పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం పిడుగురాళ్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అంజిబాబును ఏ సమయంలో తీసుకొని వెళ్లారు. ఏ ప్రాంతంలో గొడవ జరిగింది, హత్యకు సంబంధించిన కారణాలను ఎస్పీ తెలుసుకున్నారు. కేసులో నిందితులు అందరినీ అదుపులోకి తీసుకోవాలని, కేసును త్వరితగతిన ఛేదించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఎస్పీ వెంట గురజాల డీఎస్పీ సతీష్‌తోపాటు పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పవిత్ర హృదయంతో ప్రార్థించాలి


విచారణ గురువులు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి



ప్రార్థన చేస్తున్న రెవ.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి

రెంటచింతల: తపస్సుకాలంలో దీక్ష తీసుకున్న దీక్షాధారులు పవిత్ర హృదయంతో దేవుని కుమారుడైన ఏసు క్రీస్తుని ప్రార్థించాలని స్థానిక కానుక మాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి అన్నారు. భస్మ బుధవారం పురస్కరించుకుని ఫాదర్ లూర్దుమర్రెడ్డి, సహాయ గురువులు ఫాదర్ అగస్టీన్‌తో కలిసి కానుకమాత చర్చిలో ఉదయం 5.30 లకు దివ్యపూజ బలిని నిర్వహించి భక్తులకు తపస్సుకాలం విశిష్టతను వివరించారు. దీక్ష తీసుకున్నవారు పోప్ ఫ్రాన్సిస్ చెప్పిన 10 సూచనలు పాటించి సన్మార్గంలో నడవాలన్నారు. తపస్సుకాలం మొదటి రోజైన భస్మ బుధవారం మార్చి 5 నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకు 40 రోజుల పాటు ఉపవాసం, పశ్చాత్తాపం, దైవ చింతనలో గడపాలన్నారు. దివ్యపూజాబలి అనంతరం ఫాదర్ లూర్దుమర్రెడ్డి తపస్సుకాలం సందర్భంగా దీక్ష తీసుకున్న 40 మంది భక్తుల నుదిటిన విబూదిని అద్ది, జపమాల, ప్రత్యేక కండువను మెడలో వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ పవిత్ర సమష్టి దివ్యపూజా బలిలో మఠకన్యలు, చర్చి పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

●'ఆటో' ఇటో అయితే..!



ప్రమాదకర ప్రయాణాలు ప్రాణాలు పోయేలా చేస్తున్నాయి. ఏ మాత్రం అదుపు తప్పితే ప్రాణాలకే ప్రమాదం. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటంతో కూలీలు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. బుధవారం తెలంగాణ వైపు నుంచి కూలీలతో వస్తున్న ఆటో దృశ్యమిది. వెనుక ప్రమాదకరంగా నిల్చున్నదే కాకుండా ఆటోపై భాగంలో సైతం కూలీలను కూర్చోబెట్టారు. ఆటోలో నలుగురు మాత్రమే ప్రయాణం చేయాల్సి ఉండాల్సి ఉండగా 20 మందికిపై ఎక్కిస్తున్నారు. అదుపు తప్పినా, పట్టు తప్పినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- దాచేపల్లి

భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు దూరం

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.పరమేశ్వరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

సత్రశాల(రెంటచింతల): భద్రత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించడం వలన ప్రమాదాలు దరి చేరవని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.పరమేశ్వరరావు అన్నారు. స్థానిక పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆవరణలో బుధవారం నిర్వహించిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాలలో పరమేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫ్యాక్టరీలలో, కార్యాలయాలలో, బహిరంగ ప్రదేశాలలో పనిచేసే కార్మికులకు భద్రతా చర్యల ఆవశ్యకతను, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ వారోత్సవాల లక్ష్యమన్నారు. తొలుత కార్మికులతో కలిసి భద్రతా జెండాను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. పరాశక్తి ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు మాట్లాడారు. అనంతరం కార్మికులకు చిత్రలేఖనం, స్లోగన్స్, క్విజ్, నాటికలు వంటి పలు పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందచేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.రాంబాబు నర్సరావుపేట, జనరల్ మేనేజర్ ఎం.రామకృష్ణారెడ్డి, సీనియర్ డీజీఎం ఎ.వెంకట్రావ్, డీజీఎం వీఎల్ గణపతి రాజు పాల్గొన్నారు.

శ్రీ చక్ర ఫ్యాక్టరీలో ...

కారెంపూడి: స్థానిక శ్రీ చక్ర సిమెంట్స్‌లో బుధవారం జాతీయ భద్రతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్మికులు, ఉద్యోగుల సమావేశంలో ప్లాంట్ ఇన్‌ఛార్జి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. అలాగే ఆరోగ్య సంరక్షణకు తదుపరి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్మికులకు భద్రత ప్రమాణాలపై వ్యాసరచన, ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఫ్యాక్టరీ అధికారులు పరమేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.